# సాక్షి
## అన్నమయ్య జిల్లా

బుధవారం । 14 । ఆగస్టు । 2024






**అథ్లెటిక్ మీట్‌లో హోరాహోరీ**

జవహర్ నవోదయ విద్యాలయంలో రీజినల్ స్థాయి అథ్లెటిక్స్ మీట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. అథ్లెట్లు ఉత్సాహంగా పాల్గొని నైపుణ్యాన్ని ప్రదర్శించారు. - 8లో



**ఇంటివద్ద అందని రేషన్**

బి.కొత్తకోట మండలంలో గత ఆరు నెలలుగా నిత్యావసర సరుకులు అందించే ఎండీయూ వాహనాలు రావడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. - 8లో

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.270 | రూ.320 |
| రెండోరకం | రూ.200 | రూ.266 |



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 401 మెట్రిక్ టన్నులు

**పట్టుగూళ్ల ధరలు (రూ.లో)**

| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 430 | 445 |
| సీబీ | - | - |



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 239.3 కిలోలు

## న్యూస్‌రీల్

### ఒంటిమిట్ట రామయ్య హుండీ ఆదాయం లెక్కింపు

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవాలయం నెలవారి ఆదాయాన్ని మంగళవారం టీటీడీ డిప్యూటీ ఏఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో లెక్కింపు చేశారు. ఈ సందర్భంగా హుండీ లెక్కింపు ముగిసే సమయానికి రూ. 6, 85,500లు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### శానిటరీ మరుగుదొడ్ల వివరాలు అందజేయాలి

రాయచోటి టౌన్ : జిల్లాలో ఉన్న మాన్యువల్ స్కావెంజర్స్, శానిటరీ మరుగుదొడ్ల వివరాలు ఈ నెల 16వ తేదీలోగా అందజేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుప్రీం కోర్టు, కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వే అధికారులకు సహకరించి వివరాలు తెలియజేయాలని కోరారు.

### ఉపాధ్యాయ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి (జగదాంబ సెంటర్) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల నుంచి జిల్లా స్థాయి ఉపాధ్యాయ పురస్కారం-2024కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారు కనీసం 15 సంవత్సరాల బోధనా అనుభవం కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 20వ తేదీలోపు అందజేయాలని కోరారు.

### ప్రతి పాఠశాల నుంచి ఇన్‌స్పైర్ నామినేషన్లు సమర్పించాలి

– జిల్లా కలెక్టర్ శ్రీధర్



పోస్టర్ల ఆవిష్కరణలో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, తదితరులు

రాయచోటి : అన్నమయ్య జిల్లా పరిధిలోని ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్లు సమర్పించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇన్‌స్పైర్ మనక్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న అన్వేషణాత్మక ఆలోచనలను ప్రోత్సహించేందుకు ఇన్‌స్పైర్ మనక్ ఒక అద్భుతమైన వేదిక అన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో జిల్లా నుంచి 326 ప్రాజెక్టులను ఎంపిక చేసి ఒక్కో విద్యార్థికి రూ. 10 వేలు వారి వ్యక్తిగత ఖాతాలలో జమ చేశారన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి నామినేషన్లను సమర్పించి ఆంధ్రప్రదేశ్‌లో అన్నమయ్య జిల్లాను అగ్రస్థానంలో నిలపాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి శివ ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ఇన్‌స్పైర్ నామినేషన్ల సమర్పణలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించేందుకు రాయచోటి, మదనపల్లి, పీలేరు, రాజంపేటలో బుధవారం శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి, ఏడీ ప్రసాద్ బాబు, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, ఆప్కాస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, అసిస్టెంట్ ఏఎంఓ షమీవుల్లా పాల్గొన్నారు.

### 20న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం ఈనెల 20వ తేదిన ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరగనుందని జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

**కారుణ్య నియామకాలు**

జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాల కోసం మంగళవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఏఓ భాస్కర్‌రెడ్డి నిర్వహించారు. తొమ్మిది మంది అభ్యర్థులకుగాను ఏడుగురు హాజరయ్యారు.

### ఐక్యూఏసీ బృందానికి ప్రశంసలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ఇంటర్నల్ క్వాలిటీ అసెస్‌మెంట్ సెల్ (ఐక్యూఏసీ) బృందాన్ని వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి అభినందించారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ తాజాగా విడుదల చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) -2024లో యోగివేమన విశ్వవిద్యాలయానికి 51 నుంచి 100 లోపు ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే.

# బడిబస్సు.. తీస్తోంది ఆయుష్షు

- కాలం చెల్లిన, కండీషన్‌లో లేని బస్సులతో ప్రమాదం
- చిన్నారుల ప్రాణం మీదికి తెస్తున్న స్కూలు బస్సు ప్రయాణం
- చిన్నారుల భద్రతపై దొరకని భరోసా
- తల్లిదండ్రులకు తప్పని గర్భశోకం

అరిగిపోయిన టైర్లు.. ఊడొచ్చేలా స్టీరింగు.. పని చేయని క్లచ్‌లు.. తరచూ ఫెయిలయ్యే బ్రేకులు... డ్రైవర్‌కు లైసెన్సు ఉండదు.. బస్సుకా ఫిట్‌నెస్ సర్టిఫికెటూ ఉండదు.. అసలే కాలం చెల్లిన బస్సులు.. ఆపై రాష్ డ్రైవింగు.. ఇదీ స్కూల్ బస్సుల పరిస్థితి. తనిఖీ చేయాల్సిన అధికారులేమో మామూళ్ల మత్తులో ఉంటారు.. పాఠశాలల యాజమాన్యాలేమో ఫీజుల వసూళ్ల వరకే ఆలోచిస్తారు.. వెరసి చిన్నారుల ప్రాణాలు గాల్లో దీపాల్లా మారాయి. గాడి తప్పిన బడి బస్సులు చిన్నారుల బంగారు భవిష్యత్తును రోడ్డుపాలు చేస్తున్నాయి. పిల్లల ఆయుష్షను మొగ్గలోనే చిదిమేస్తున్నాయి.

**తప్పిన పెను ప్రమాదం**

సరిగ్గా ఏడాది కిందట రాయచోటికి చెందిన ఒక ప్రైవేటు స్కూలు బస్సు రామాపురం నుంచి వస్తుండగా రింగ్‌రోడ్డు వద్దకు రాగానే టైరు ఊడిపోయి బస్సు రోడ్డుపక్క గుంతలోకి వెళ్లింది. అప్పట్లో బస్సు బోల్తా పడి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది. టైరు ఊడిపోయి రోడ్డు పక్కన గుంత లోకి వెళ్లడంతో నలుగురు చిన్నారులకు గాయాలయ్యాయి.



| | |
|---|---|
| 818 | విద్యా సంస్థల బస్సులు |
| 696 | ఎఫ్‌సీ కలిగిన బస్సులు |
| 122 | ఫిట్‌నెస్ చేయించడానికి అవకాశం లేని బస్సులు |



ఇటీవల వైఎస్సార్ జిల్లా వల్లూరు సమీపంలో బోల్తా పడిన స్కూల్ బస్సు (ఫైల్)

సాక్షి,రాయచోటి/ రాయచోటి : బడి బస్సులు బోల్తా కొడుతున్నాయి.. అభం శుభం తెలియని చిన్నారుల ఆయుష్షు తీస్తున్నాయి.. అప్పుడే యూనిఫాం ధరించి.. పుస్తకాలు చేతబట్టి బంగారు భవిష్యత్తు కోసం అమ్మా, నాన్నకు బైబై చెప్పి బడిబాట పట్టిన చిన్నారులను బస్సు రూపంలో మృత్యువు కబళిస్తోంది. డ్రైవర్లు నడపడంలో తడబడుతున్నారా.. రవాణాశాఖ అధికారులు బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ అందించడంలో మమ అనిపిస్తున్నారా.. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమో తెలియదుగానీ పసి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. చిన్నారులు బస్సులో ఉత్సాహంగా వెళుతున్న ఆనంద క్షణాన తప్పు ఎవరు చేసినా శిక్ష మాత్రం పసి హృదయాలకు పడుతోంది. ప్రమాద సమయంలో అమ్మా అని అరిచినా.. నాన్నా అని అల్లాడినా...చిన్నారుల అరుపులు ఆ దేవుడిని కూడా కదిలించలేకపోయాయి. కండీషన్ లేని బస్సులు తిరుగుతున్నా.. కాలం చెల్లిన బస్సులు అధికారుల కళ్లు గప్పుతున్నా చివరికి చిన్నారులే తగిన మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి వస్తుండడం బాధాకరం. రవాణా అధికారులు ఎఫ్‌సీ ఇవ్వాలంటే చెబుతున్న నిబంధనలను పరిశీలిస్తే ఉన్న బస్సుల్లో సగానికి పైగా అర్హతను సాధించలేవని చెప్పకనే చెప్పవచ్చు. బస్సులో డ్రైవర్ సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నా.. మద్యం సేవించి నడుపుతున్నా.. ఇదేమని అడిగే ధైర్యం చిన్నారులకు లేనందున వారు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతోంది. ఇప్పటికైనా చిన్నారులు బస్సులో ఉన్నారన్న సంగతిని గుర్తెరిగి గమ్యస్థానానికి బస్సును జాగ్రత్తగా తీసుకు వెళితేనే తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం వికసిస్తుంది.

**అప్పుడప్పుడూ ప్రమాదాలు జరుగుతున్నా..**

జిల్లాలో చిన్నారులు బస్సులో బడికి వెళ్లడం ఎంత ముఖ్యమో...తిరిగి రావడం కూడా అంతే ముఖ్యం. అయితే జిల్లాలో అప్పుడప్పుడూ బస్సు ప్రమాద ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. జాగ్రత్తలు తీసుకోకపోతే పెద్ద ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడమే అవుతుంది. ప్రధానంగా రైల్వే గేట్లు దాటుతున్న సమయంలోనూ.. సర్కిళ్లలో బస్సు తిప్పుతున్న సమయంలోనూ, ఇతర, ఎదురు వాహనాలు క్రాస్ చేయడంలోనూ ప్రత్యేకంగా జాగ్రత్తలు వహించకపోతే జరగరాని నష్టం జరిగిపోతుంది. ఇప్పటికైనా అధికారులతోపాటు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం కూడా బస్సుల కండీషన్ విషయంతోపాటు నిపుణులైన డ్రైవర్లను నియమించాలి. ఎందుకంటే గతంలో రాయచోటిలో స్కూలు బస్సు టైరు ఊడిపోయి గుంతలోకి దిగబడి సుమారు నలుగురికి గాయాలు కాగా, రెండు రోజుల క్రితం ఓబులవారిపల్లె వద్ద జరిగిన దుర్ఘటనలో ఒక చిన్నారి చనిపోగా పలువురికి గాయాలైన ఘటనలు కలిచి వేస్తున్నాయి.

**జిల్లాలో 696 బస్సులకు ఎఫ్‌సీలు**

అన్నమయ్య జిల్లా రవాణాశాఖాధికారులు పాఠశాలల ప్రారంభానికి ముందే అంటే జూన్‌లో సుమారు 696 ప్రైవేటు పాఠశాలల బస్సులను పరిశీలించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందజేశారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 818 బస్సులు ఉండగా, 696 బస్సులకు ఎఫ్‌సీలు అందించారు. మిగిలిన 122 బస్సులకు సంబంధించి కాలపరిమితి ముగిసిన బస్సులతోపాటు కండీషన్‌లో లేని బస్సుల నేపథ్యంలో వాటిని నిలిపివేశారు. దీంతో అవి తిరుగుతున్నాయో, లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు మాత్రం వాటిని పక్కన పెట్టినట్లు చెప్పుకొస్తున్నారు.

**మద్యం తాగొద్దు.. సెల్‌ఫోన్ మాట్లాడొద్దు**

స్కూలు బస్సులు నడిపే డ్రైవర్ల విషయంలో రవాణాశాఖ అధికారులు లైట్ వెహికల్, హెవీ వెహికల్స్ నడిపే డ్రైవర్లకు ఐదేళ్ల సీనియారిటీ ఉంటేనే అనుమతిస్తున్నారు. అయితే ఇది ఎంతమాత్రం ప్రైవేటు యాజమాన్యాలు అమలు చేస్తున్నాయన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. దీనికితోడు కొంతమంది రాత్రిళ్లు మద్యం సేవించి ఉదయాన్నే విధులకు వస్తున్నారు. అంతేకాకుండా స్కూలు బస్సులు నడిపే డ్రైవర్లు అందరికీ సెల్‌ఫోన్లు ఉన్నాయి. బస్సు నడిపే సమయంలో కాల్స్ వస్తే మాట్లాడటం పరిపాటిగా మారింది. మద్యం సేవించి బస్సు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడాన్ని నిషేధించాలి.

**నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు**



స్కూల్ బస్సుల భద్రత విషయంలో రాజీపడేది లేదు. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకోసం ఉపయోగిస్తున్న బస్సుల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేస్తున్నాం. బస్సులన్నింటినీ తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తున్నాం. ఈ సర్టిఫికెట్ లేనివాటిని సీజ్ చేస్తున్నాం.పాఠశాలల బస్సు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి, రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. మంగళవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో రెండు బస్సులను సీజ్ చేశాం. స్పెషల్ డ్రైవ్ మరికొద్ది రోజులు కొనసాగుతుంది.


– భరత్ చౌహాన్, జిల్లా రవాణాశాఖ అధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా

**నిబంధనలు ఇలా!**



- బస్సు నడిపే డ్రైవర్‌కు ఐదు సంవత్సరాల హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండి, 60 సంవత్సరాలు వయస్సు మించరాదు.
- కంటి చూపులో తేడా ఉండరాదు.
- డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు బస్సుపై ముద్రించాలి.
- బస్సుకు ముందు, వెనక పాఠశాల పేరును పెద్దదిగా ముద్రించాలి.
- వాహనం పర్మిట్, కాలుష్య నియంత్రణ, బీమా పత్రాలు, ప్రథమ చికిత్స కిట్‌ను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలి.
- బస్సులో పిల్లలను ఎక్కించడానికి, దించడానికి ఒక సహాయకుడు ఉండాలి.
- పిల్లలు బస్సు ఎక్కడానికి వీలుగా మెట్లు ఉండాలి.
- కిటికీ అద్దాలకు బయట పక్కన కడ్డీలతో కూడిన జాలీ ఉండాలి.
- వాహనంలో పిల్లలకు అనువుగా సీట్లు ఉండాలి.
- ఇంజిన్ కండీషన్‌లో ఉండాలి.

**అతివేగం అనర్థం**



జిల్లాలో స్కూలు బస్సుల డ్రైవర్లు ఓపికగా ఉండాలి. అతి వేగం ప్రమాదకరం. రవాణాశాఖ స్కూలు బస్సులకు 60 కిలోమీటర్ల స్పీడ్ ఇచ్చినా పట్టణాల్లో 20-40 కి.మీ.లోపు మాత్రమే వెళ్లాలి. అందులోనూ చిన్నారులు ఉంటారు కాబట్టి సడన్‌గా బ్రేక్ వేసినా, ఒక్కసారిగా పక్కకు తిప్పినా బస్సులోనే కిందపడే ప్రమాదముంది. ఇలాంటి తరుణంలో వేగాన్ని నియంత్రించుకోవడం చాలా అవసరం. తద్వారా ప్రమాదాలను కూడా తగ్గించుకోవచ్చని నిపుణులు తెలియజేసున్నారు.

**స్కూలు బస్సుల తనిఖీ**

రాజంపేట : రాజంపేట, మంగంపేట, రైల్వేకోడూరు ప్రాంతాలలో స్కూల్ బస్సులను మంగళవారం రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. బస్‌లో ఉన్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్కూల్‌బస్ డ్రైవర్ల లైసెన్సులు, బస్సు కండీషన్‌ను పరిశీలించారు. స్కూల్‌బస్, స్కూల్ వ్యాన్‌లో ఓవర్‌లోడ్ ఉంటే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రాజంపేట ఎంవీఐ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఓబులవారిపల్లెలో జరిగిన స్కూల్‌బస్ ప్రమాదానికి మానవ తప్పిదమే కారణమని భావిస్తున్నామన్నారు. ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి డ్రైవర్ సడన్ బ్రేకు వేయడంతో బస్సులో ఉన్న విద్యార్థి ఎగిరి డ్రైవర్ స్టీరింగ్‌పై పడటం, ఆయన కంట్రోల్ చేసుకోలేక పోవడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోందన్నారు.

**భవిష్యత్తును చిదిమేసింది..**



చిన్నారి మృతదేహం వద్ద విలపిస్తున్న తాత(ఫైల్)



భవిష్య (ఫైల్)

ఓబులవారిపల్లె : వేకువ జామున నిద్రలేచి హడావిడిగా పుస్తకాలు సర్ది.. తన గారాల పట్టిని ముస్తాబు చేసి స్కూల్ వ్యాన్‌లో కూర్చోబెట్టి టాటా చెప్పి మురిసిపోయిన ఆ తల్లి ఆనందం క్షణాల్లో ఆవిరైపోయింది. వ్యాన్ బయలు దేరిన ఐదు నిమిషాలకే తన బిడ్డ తనువు చాలించిందనే పిడుగుపాటు లాంటి వార్త ఆ తల్లి గుండెను పిండేసింది. దేవుడా ఎంత పనిచేశావు అంటూ ఆ మాతృమూర్తి కన్నీరు మున్నీరుగా విలపిస్తుంటే ప్రతి ఒక్కరి హృదయం చలించిపోయింది. ఓబులవారిపల్లె మండల కేంద్రానికి చెందిన వీరంరెడ్డి మధుసూధన్‌రెడ్డి, అరుణ దంపతులకు తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. కుమార్తె భవిష్య(07), ఏడాది వయసున్న కుమారుడు వీరం రెడ్డి మోక్షజ్ఞ సాయికుమార్‌రెడ్డి ఉన్నారు. ఎంతో చలాకీగా ఉండే భవిష్య చిన్నఓరంపాడు అయ్యలరాజుపల్లె శ్రీవాణి హైస్కూల్‌లో రెండో తరగతి చదువుతోంది. ప్రతి రోజు మాదిరిగా సోమవారం ఉదయం పాఠశాలకు వ్యాన్‌లో బయలు దేరింది. పాఠశాల సమీపంలో వ్యాన్ బోల్తా పడిన ఘటనలో భవిష్య అక్కడికక్కడే మృతి చెందింది. ఒక్కగానొక్క కుమార్తె మృతి చెందడంతో ఆ తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం. వ్యాన్ డ్రైవర్ సెల్‌ఫోన్ చూస్తూ నిర్లక్ష్యంగా వాహనం నడపడం, కాలం చెల్లిన బస్సులను వాడటం, అతి వేగంగా నడపడం తదితర కారణాలు తమ బిడ్డను బలిగొన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా.. మరో చిన్నారి ప్రాణాలు బలి కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు వేడుకుంటున్నారు.



శోకసంద్రంలో చిన్నారి తల్లిదండ్రులు

# ముంచెత్తిన వాన

**బి.కొత్తకోటలో అత్యధికంగా 95 మి.మీ.**



రామసముద్రం సబ్‌స్టేషన్‌లో చెరువును తలపిస్తున్న నీరు

బి.కొత్తకోట : మదనపల్లె డివిజన్ పరిధిలోని మండలాల్లో సోమవారం రాత్రి భారీ వర్షాలు కురిశాయి. ఇందులో బి.కొత్తకోట మండలంలో భీకరమైన ఉరుములు, మెరుపులతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. బి.కొత్తకోటలో అత్యధికంగా 95 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ములకలచెరువులో 51.6, తంబళ్లపల్లెలో 54.4, పెద్దమండ్యంలో 41.8, గుర్రంకొండలో 5.0, పీలేరులో 5.4, కలికిరిలో 15.4, వాయల్పాడులో 34.6, కురబలకోటలో 60.4, పెద్దతిప్పసముద్రంలో 88, మదనపల్లెలో 81, నిమ్మనపల్లెలో 50.8, రామసముద్రంలో 31 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

**ఎటుచూసినా వర్షపు నీరే.!**

రామసముద్రం : రామసముద్రం మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎటు చూసినా వర్షపునీరు చేరి తీవ్ర నష్టం వాటిల్లింది. మంగళవారం వేకువజామున కురుసిన వర్షానికి గుంతయంబాడి, మినికి, రచ్చ, కేసీపల్లి తదితర గ్రామాల వద్ద రోడ్లపై వర్షపునీరు నిలిచిపోయింది. ప్రయాణికులు, విద్యార్థులు, ఆటోలు, ద్విచక్రవాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు పత్తా లేకుండా పోయారని స్థానికులు మండిపడుతున్నారు. వర్షం కారణంగా టమాటా, క్యాలీఫ్లవర్, బంతి, కొత్తిమీర తదితర పంటల్లో నీరు నిలిచిపోయి భారీ నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామసముద్రం సబ్‌స్టేషన్‌లో వర్షపునీరు చేరడంతో చెరువును తలపిస్తోంది. పలుచోట్ల చెట్లు పడిపోయాయి.



రామసముద్రంలో బంతిపంటలో నిలిచిపోయిన వర్షపునీరు

## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

– మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



అధికారులు, ప్రజా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

రాయచోటి : రాష్ట్రంలో నెలకొన్న భూమి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థలో జరిగిన చిన్న చిన్న పొరపాట్ల వలన చాలా మంది రైతులు, వారసులు ఇబ్బందులు, సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ పరంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్ఓ సత్యనారాయణ రావు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

**ప్రజా దర్బార్‌కు స్పందన**

రాయచోటి టౌన్ : మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు స్పందన లభించింది.

## హర్ ఘర్ తిరంగా .. జనమంతా మురవంగా



జాతీయ జెండాతో ర్యాలీలో వెళుతున్న విద్యార్థులు

రాయచోటి : 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 100 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీని ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్ ఆవరణంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్, డీఆర్ఓ సత్యనారాయణరావు, ఆర్డీఓ రంగస్వామి, డీఎఫ్ఓ అనిల్‌కుమార్‌లతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తామని, స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని గౌరవిస్తామని, భారతదేశ అభివృద్ధి, పురోగతికి అంకితం అవుతామని హర్ ఘర్ తిరంగా ప్రతిజ్ఞ చేయించారు.

**వేయిఅడుగుల జెండాతో ర్యాలీ**



అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం చేనేతనగర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు మంగళవారం వెయ్యి అడుగుల జాతీయ జెండాను ప్రదర్శించారు. పంద్రాగస్టు జెండా పండగను పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. – కురబలకోట

■ కొమ్మ ముడిపడింది.. ఐక్యత చాటుతోంది






ప్రకృతిలో ఎన్నో వింతలు చూస్తుంటాం. చేతులు కట్టినట్లు కనిపించే ఈ చెట్టు ఐక్యతను గుర్తు చేస్తోంది. బి.కొత్తకోట మండలం పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్‌పై అటవీశాఖ ప్రాంగణంలోని ఈ చెట్ల కలయిక కనిపించింది. జకరండాగా పిలువబడే ఈ చెట్లు కొండపై అధికంగా కనిపిస్తాయి. ఇవి వేర్వేరుగా ఎదుగుతూ పైకి ఎగబాకాయి. ఆ క్రమంలో రెండు చెట్ల కొమ్మలు ఒకదానికొకటి అతుక్కుపోయి..పెద్ద కొమ్మగా ఎదిగింది. ఈ చెట్ల విశేషాన్ని తిలకించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు.

– బి.కొత్తకోట

■ వాహనం పాడైంది.. పోస్టర్ అడ్డుపడింది




కుయ్ కుయ్‌మంటూ వచ్చే 108 వాహనం చూస్తే అంబులెన్స్ అని ఇట్టే అర్థమవుతుంది. మరి ఇదేమిటి.. ఈ వాహనంపై టీ కాఫీ టిఫిన్ అని ఆశ్చర్యంగా చూస్తున్నారా.. అవును నిజమే క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించే 108 వాహనం దుస్థితి ఇదీ. ఈ వాహనం మొత్తం పాడైపోయింది. దీంతో వర్షాలు కురిస్తే చాలు తడిసి ముద్దవుతోంది. సిబ్బంది వాటి నుంచి రక్షణ కోసం ఇదిగో ఇలా టీ.. కాఫీ. టిఫిన్ బోర్డు అడ్డంగా పెట్టేసి తడవకుండా రక్షణ పొందుతున్నారు.

– వాల్మీకిపురం

■ పట్టు తప్పితే.. ప్రాణం పోతుంది



ఒకరిని చూసి మరొకరు.. సరదా అనుకుంటే.. ప్రాణ మీదుకు తెచ్చుకున్నట్లే. విద్యుత్తు స్తంభంతో ఈ చిన్నారులు ప్రయాణంలో ఇలా ఆడుకోవాలనుకుంటే కిందపడి ప్రాణం పోతుంది. పులివెందుల మండలంలో ఇలా ప్రమాదకరంగా ఓ ట్రాక్టర్‌లో విద్యుత్ స్తంభాలపై పిల్లలు కూర్చొని ప్రయాణం చేస్తున్నారు. ఏ మాత్రం పట్టు తప్పినా.. కింద పడిపోతారు. అధికారులు ఇలాంటి ప్రయాణం చేయకుండా కాపాడాల్సిన అవసరం ఉంది.

– పులివెందుల రూరల్

## క్లుప్తంగా

### కోడిపందెం స్థావరాలపై దాడి

**పుల్లంపేట :** మండలంలోని గోళ్లవారిపల్లి వద్ద మామిడి తోటలో కోడిపందెం ఆడు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ తెలిపారు. వారి నుంచి రూ. 5100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### ఒంటిమిట్టలో దొంగల హల్‌చల్

**ఒంటిమిట్ట :** మండల కేంద్రమైన ఒంటిమిట్టలో ఇద్దరు దొంగలు హల్చల్ చేసినట్లు సమాచారం. స్థానికుల వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం గుర్తుతెలియని ఇద్దరు దొంగలు ఎక్సెల్లో వచ్చారు. ఒకరు ఒంటిమిట్ట బజారు వీధిలోని ఓ ఇంటిలోకి చొరబడ్డాడు. ఇది గమనించిన స్థానికులు వారిని పట్టుకోవాలని ప్రయత్నించగా ఒకడు పరారయ్యాడు. పట్టుబడ్డవాడిని స్థానికులు పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పారు. నిందితుడిని విచారించగా వారు బద్వేల్ కు చెందినవారుగా పోలీసులు గుర్తించారు.

### పురుగు మందు తాగి వివాహిత మృతి

**పెద్దతిప్పసముద్రం :** మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ కొత్తపల్లితకి చెందిన ఆశ్విని(21) అనే వివాహిత కుటుంబ కలహాలతో మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. కుటుంబ సభ్యులు ఆమెను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### మా విధులకు అటంకం కలిగిస్తున్నారు



మాట్లాడుతున్న డాక్టర్ శివశంకర్

**సిద్దవటం :** మండలంలోని భాకరాపేట పశు వైద్య శాలలో కొందరు మద్యం తాగి తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని భాకరాపేట పశు వైద్యాధికారి డాక్టర్ శివశంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దవటం విలేకరులతో డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ భాకరాపేట పశువుల ఆసుపత్రిలో కొత్త వ్యక్తులు రోజూ మద్యం తాగి నీచంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఈ విషయమై సిద్దవటం అధికారులకు తెలియజేశామన్నారు. మీరు ఏమి వైద్యం అందిస్తారంటూ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఇలాగే ప్రవర్తిస్తే పశు వైద్యశాల మూసివేసి ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

## ఆరు నెలలుగా
# ఇంటివద్ద అందని రేషన్

- అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలానికి 11 మంజూరు చేయగా 4 వాహనాలు నిలిపివేత
- డీలర్ల వద్దకు వచ్చి రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు



బి.కొత్తకోట ఎంపీడీఓ కార్యాలయంలో వాహనాలు

| మండలం | బి.కొత్తకోట |
|---|---|
| చౌక దుకాణాలు | 35 |
| ఏఏవై కార్డులు | 2,057 |
| రేషన్ కార్డులు | 14,544 |
| మొత్తం | 16,679 |
| ఎండీయూ వాహనాలు | 11 |

**బి.కొత్తకోట :** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఘనమైన ఆశయంతో అమలులోకి తీసుకొచ్చిన మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ విధానంపై అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. మండలంలోని బయ్యప్పగారిపల్లె, శీలంవారిపల్లె, కోటావూరు, బడికాయలపల్లె, గట్టు, గుమ్మసముద్రం పంచాయతీలకు నాలుగు ఎండీయూ వాహనాలు కేటాయించారు. కేటాయించిన పంచాయతీలలో ప్రతి నెలా కార్డు దారుల ఇంటి వద్దకు వెళ్లి నిత్యావసరాలు అందించాలి. గత ఆరు నెలలుగా ఈ వాహనాలు పల్లె ముఖం చూడలేదు. పౌరసరఫరాల గోదాము నుంచి నిత్యావసరాలను చౌక డీలర్లకు తరలించారు. వారు అక్కడి నుంచే కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. గతంలో ఇంట్లో కూలి పనులకు వెళ్లినా.. ఎవరో ఒకరు ఎండీయూ వాహనం వస్తే సరకులు తీసుకునేవాళ్లు. ఇప్పుడు ఒకరు ప్రత్యేకంగా రేషన్ కోసం వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలుగా సేవలు ఆగినా రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదు. తక్షణమే ప్రత్యామ్నయంగా చర్యలు తీసుకోవాల్సింది. పౌరసరఫరాల విభాగం డిప్యూటీ తహసీల్దారు వెంకటరెడ్డి మాట్లాడుతూ తాము వాహనాల నిర్వహణ చేయలేమని చెప్పడంతో ఎండీయూ సేవలు నిలిచిపోయినట్లు చెప్పారు.

## ఇల్లు అమ్మేందుకు అంగీకరించలేదని ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన ఆనందనాయుడు

**మదనపల్లె :** భార్య ఇల్లు అమ్మేందుకు నిరాకరించడంతో మనస్తాపం చెందిన భర్త పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్టేట్‌లోని గోవర్ధననగర్‌కు చెందిన కె.ఆనందనాయుడు భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో పొలం కొనేందుకు వెంకప్పకోటలో సొంత ఇంటిని అమ్మాలని నిర్ణయించి భార్యతో చర్చించాడు. అయితే ఇల్లు అమ్మేందుకు ఆమెనిరాకరించింది. దీంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి పడుకున్నాడు. తరచూ మద్యం తాగి ఇంటికి వచ్చాడని భావించిన కుటుంబ సభ్యులు... కొద్దిసేపటి తర్వాత ఆనందనాయుడు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

## కాపురానికి పంపమంటే తల పగలగొట్టారు



గాయపడ్డ సురేష్

**మదనపల్లె :** భార్యను కాపురానికి పంపమంటే అత్తింటివారు తల పగలగొట్టి ఆస్పత్రికి పంపారని భర్త సురేష్ తెలిపాడు. దాడి ఘటనపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణంలోని బుగ్గ కాలువకు చెందిన భాస్కర్ కుమారుడు పి.సురేష్(37) సప్తగిరి గ్రామీణ బ్యాంకు వద్ద మీ–సేవ సెంటర్ నిర్వహిస్తున్నాడు. భార్య సరితతో కుటుంబ విభేదాలు ఉండడంతో కోర్టులో కేసు నడుస్తోంది. పది రోజుల కిందట కోర్టు వాయిదాకు వెళ్లిన సమయంలో కాపురానికి రావాల్సిందిగా భార్యను ప్రాధేయపడ్డాడు. ఆమె పుట్టింటివారిని అడిగి ఇంటికి తీసుకెళ్లమని చెప్పింది. మంగళవారం సరిత పుట్టినరోజు కావడంతో అత్తవారింటికి వెళ్లి భార్యను తనతో పంపాల్సిందిగా కోరాడు. ఇంతలో సరిత బాబాయ్ కాయల గంగులప్ప మద్యం తాగి వచ్చి ఇనుపరాడ్‌తో సురేష్ తలపై దాడి చేశాడు. దీంతో గాయపడిన సురేష్ స్థానికుల సహాయంతో జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందాడు.

• ఘనంగా వెంగమాంబ వర్ధంతి



అలంకరణలో వెంగమాంబ



లక్ష్మీనరసింహుడికి కల్యాణోత్సవం నిర్వహించిన అర్చకులు

**గుర్రంకొండ :** మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన వెంగమాంబ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. టీటీడీ అధికారులు వెంగమాంబకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారిని రంగుల పుష్పాలతో ఆకట్టుకునేలా అలంకరించారు. వేకువజామునే నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం ఆలయ పరిసరాల్లో నరసింహస్వామికి కల్యాణం జరిపారు. చలువ పందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లి వేదిక అందంగా అలంకరించి మూలవరులకు ముందుగా అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముత్యాల తలంబ్రాలతో స్వామి పెళ్లి వేడుక వైభవంగా నిర్వహించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ అధికారులు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామి ప్రసాదాలు అందజేశారు. తిరుపతి వెంగమాంబ ప్రాజెక్టు కళాకారులచే నిర్వహించిన కచేరి ఆకట్టుకొంది. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

### చిన్నారి కేశాల దానం



కేశాలు దానం చేస్తున్న విద్యారిని భవిష్య

**మదనపల్లె సిటీ :** క్యాన్సర్ బాధితుల మోముల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్ మైండ్స్ తలపెట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం మదనపల్లెకు చెందిన ధనమ్మ, కృష్ణారెడ్డిల కుమార్తె భవష్య హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయానికి వచ్చి స్వచ్ఛందంగా తమ కేశాలను దానం చేశారు. నిర్వాహకురాలు అబూబకర్‌సిద్దిక్ వీరికి పూల మొక్కలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కిరణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధురాలి మెడలో చైన్ చోరీ



గొలుసు పోగొట్టుకున్న బాధితురాలు

**రైల్వేకోడూరు అర్బన్ :** రైల్వే కోడూరు మండలం రెడ్డివారిపల్లి పంచాయతీకి చెందిన వృద్ధురాలు కంచర్ల రాజమ్మ మంగళవారం తిరుపతి నుంచి వస్తూ కోడూరులో దిగి ఆటోలో వెళ్తుండగా కెసి.అగ్రహారం వద్ద గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంలో వచ్చి ఆటో ఆపారు. వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును లాక్కెళ్లారు. మెడలో గొలుసు సుమారు రూ.2.70 లక్షల విలువ ఉంటుందని పేర్కొన్నారు.

### కుమార్తె కనబడలేదని తండ్రి ఫిర్యాదు

**వీరబల్లి:** మండలంలోని కొత్తపేటకు చెందిన అనిపినేని తాతయ్య మంగళవారం తన కుమార్తె నాగజ్యోతి కనబడలేదని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాగజ్యోతి ఇటీవల ఇడుపుల పాటి ట్రిపుల్ ఐటీ పూర్తి చేసుకొని ఇంటి దగ్గరే ఉండేదని తండ్రి తాతయ్య తెలిపారు. కొన్ని రోజుల నుంచి సమీప బంధువైన తిరుపతి జిల్లా చిన్నగొట్టికల్లు ప్రాంతానికి చెందిన శివప్రసాద్‌తో ఫోన్‌లో తరచుగా మాట్లాడేదని, మంగళవారం నుంచి కనిపించలేదని తెలిపారు. ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### సీఐల బదిలీ

**రాయచోటి :** అన్నమయ్య జిల్లా పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు.

| స్టేషన్ | సీఐ పేరు |
|---|---|
| రాయచోటి అర్బన్ | సి.చంద్రశేఖర్ |
| రాయచోటి రూరల్ | ఎన్.వరప్రసాద్ |
| రాయచోటి ట్రాఫిక్ | డి.హాజీవలి |
| లక్కిరెడ్డిపల్లి | టివి.కొండారెడ్డి |
| మదనపల్లి టూటౌన్ | కె.రామచంద్ర |
| మదనపల్లె తాలూకా | కాలా వెంకటరమణ |
| మొలకలచెరువు | సి.రాజారమేష్ |
| రాజంపేట అర్బన్ | జి.వెంకటేశ్వర్లు |
| రాజంపేట రూరల్ | జీవీ.రమణ |
| రైల్వేకోడూరు సర్కిల్ | కె.యల్లమరాజు |
| బి.కొత్తకోట అర్బన్ | కె.రాజారెడ్డి |
| వీఆర్, అన్నమయ్య | జి.యువరాజు |
| వీఆర్, అన్నమయ్య | ఎన్.సూర్యనారాయణ |
| వీఆర్, అన్నమయ్య | ఎం.మంజునాథరెడ్డి |
| వీఆర్, అన్నమయ్య | జి.జీవగంగనాథ్‌బాబు |
| వీఆర్, అన్నమయ్య | టి.మధు |
| డీపీటీసీ, అన్నమయ్య | ఎం.దస్తగిరిబాబు |
| దిశా-1, అన్నమయ్య | ఎ.మోహన్‌కుమార్ |

## రెండు కిలోల గంజాయి స్వాధీనం

12 మంది నిందితుల అరెస్ట్



గంజాయి తీసుకున్న యువకులను చూపుతున్న డీఎస్పీ కొండయ్య నాయుడు

**మదనపల్లె :** పట్టణంలోని కోళ్లబైలు పరిధిలో గంజాయి తీసుకుంటున్న 12 మందిని అరెస్టు చేసి వారి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. తాలూకా పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. మదనపల్లె మండలం కోళ్లబైలు పరిధి లోని చెట్ల పొదల్లో కొందరు యువకులు గంజాయి తీసుకుంటున్నట్లు సీఐ ఎస్.శేఖర్‌కు సమాచారం అందిందన్నారు. సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన కొండమర్రి గణేష్(22), రామిశెట్టి శ్రీనివాసులు(21), మోడెం బాలాజీ(23), జుజ్జూరపు సునీల్‌కుమార్(23), మాడి కిరణ్‌కుమార్(2), మాడి కల్యాణ్(23), బత్తిని శివశంకర(20), గోవిందు జగదీష్(23), సద్దాల వెంకటేష(25), రొద్దా నిరంజన్(24), విష్ణు(23), షేక్ బాబా ఫక్రుద్దీన్(21)లను అరెస్టు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో చదువు మధ్యలో నిలిపివేసిన విద్యార్థులు, ఇతరులు ఉన్నారన్నారు. మండల డిప్యూటీ తహసీల్దారు బావాజాన్, వీఆర్వో మాధవరెడ్డి సమక్షంలో విచారించి గంజాయిని, తాగేందుకు వినియోగిస్తున్న రూ.14,400 విలువ కలిగిన సిగరెట్ పేపర్, ఫిల్టర్స్‌ను మంగళవారం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. బంగారపు వాండ్లపల్లెకు చెందిన మౌలాలి నుంచి కిలో గంజాయి రూ.23 వేలకు కొనుగోలు చేసినట్లు నిందితులు తెలిపారన్నారు. డీఎస్పీ కొండయ్యనాయుడు మాట్లాడుతూ... గంజాయి తాగుతూ పట్టుబడిన వారిలో 25ఏళ్ల లోపు వయస్సు కలిగిన యువకులు ఉండడం బాధాకరమన్నారు. విక్రయదారుల తోపాటు గంజాయి తీసుకునే వారిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో తాలూకా సీఐ ఎస్.శేఖర్, రూరల్ సర్కిల్ సీఐ రమేష్, ఎస్ఐ హరిహరప్రసాద్, పి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

## హెరిటేజ్ కోసం అముల్‌ని మూసివేయకండి

రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు



రామానాయుడు

**మదనపల్లె :** హెరిటేజ్ డెయిరీని కాపాడుకునేందుకే అముల్ డెయిరీని మూసివేసేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు ఓ ప్రకటనలో విమర్శించారు. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార సంఘం ఆధ్వర్యంలో విజయ పాల డెయిరీ ఏర్పాటుచేసి లక్షలాది లీటర్ల పాల సేకరణ చేశారన్నారు. దీంతో రైతులు ఆర్థిక సమృద్ధిని సాధించారన్నారు. అయితే ప్రైవేట్ పాల డెయిరీల మనుగడ కోసం అప్పటి ప్రభుత్వం విజయ డెయిరీని మూసివేసిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తిరిగి విజయా డెయిరీకి పూర్వ వైభవం తీసుకువచ్చే క్రమంలో భవనాలు, యంత్రాలను గుజరాత్‌కు చెందిన సహకార సంస్థ అముల్ డెయిరీకి అప్పగించి పాలసేకరణకు శ్రీకారం చుట్టిందన్నారు. అప్పటి నుంచి ప్రైవేట్ డెయిరీల దోపిడీకి అడ్డుకట్ట వేయడమే గాక పాడిరైతులకు అముల్ డెయిరీ అధిక ధరలు చెల్లిస్తూ వస్తోందన్నారు.

లీటరుకు రూ.37 నుంచి 43 చెల్లిస్తుంటే... ప్రైవేట్ డెయిరీలు కేవలం రూ.27 నుంచి 33 మాత్రమే చెల్లిస్తున్నాయన్నారు. ఇపుడు అముల్ డెయిరీని ఉన్న ఫళంగా మూసివేస్తే గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. డెయిరీని కొనసాగించకపోతే రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు.

## అథ్లెటిక్ మీట్‌లో హోరాహోరీ



పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

**మదనపల్లె సిటీ :** స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో జరుగుతున్న రీజనల్ స్థాయి అథ్లెటిక్స్ మీట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన పోటీల్లో 3000 మీటర్ల పరుగు పందెం పోటీలను ప్రిన్సిపల్ గోవిందరావు స్టార్టర్ పిస్టల్ పేల్చి ప్రారంభించారు. అథ్లెట్లు ఉత్సాహంగా పాల్గొని నైపుణ్యాన్ని ప్రదర్శించారు. హైజంప్, పరుగు పందెం, హామర్ త్రో ఈవెంట్స్ జరిగాయి. అండర్–14 బాలుర 600 మీటర్ల పరుగు పందెంలో నివేద్(కాసర్‌గాడ్ క్లస్టర్) అండర్–17 బాలుర 800 మీటర్ల పరుగు పందెంలో డిగిన్ దివాకర్(కాసర్‌గాడ్ క్లస్టర్), అండర్–17 బాలికల 1500 మీటర్ల పరుగు పందెంలో దేవిక మనోజ్(కొట్టాయం క్లస్టర్) అండర్–19 బాలుర 1500 మీటర్ల పరుగు పందెంలో అమల్‌బాబు(కాసర్‌గాడ్ క్లస్టర్), అండర్–19 బాలికల హైజంప్ విభాగంలో తేజస్విని(చిత్తూరు క్లస్టర్)లు ప్రథమ స్థానంలో నిలిచి బహుమతులు కైవసం చేసుకున్నారు. విజేతలకు ప్రిన్సిపల్ గోవిందరావు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వేలాయుధన్, జి.సురేంద్రరెడ్డి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న ప్రభాకర్ (ఫైల్)

**మదనపల్లె :** అప్పుల బాధతో పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం పట్టణంలో జరిగింది. గాలివీడు మండలం అరవీడు గ్రామం కుమ్మరయ్యగారిపల్లెకు చెందిన బండారు పెద్దన్న కుమారుడు బండారు ప్రభాకర్(39) మదనపల్లె టూటౌన్ పోలీస్ స్టేషన్ వెనుకవైపున పురుగులమందు తాగి మృతిచెందాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెళ్లి మృతుడి సెల్‌ఫోన్, వాటర్ బాటిల్, పురుగుమందు డబ్బా స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. బండారు ప్రభాకర్ గాలివీడులో హోటల్ నిర్వహించి, నష్టం రావడంతో బెంగళూరుకు వెళ్లి ప్రైవేట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేసేవాడన్నారు. ఈయన తొలి భార్య ప్రవల్లిక మృతి చెందడంతో సుకన్యను వివాహం చేసుకున్నారు. కుమార్తె దక్షిత, రెండేళ్ల దేవాన్ష్ సంతానం. సోమ వారం బ్యాంకులో పని ఉందని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన అతడు తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం ప్రభాకర్ మరణవార్త తెలియడంతో కన్నీరు మున్నీరయ్యారు. ప్రభాకర్ సోదరుడు రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ యువరాజు తెలిపారు.

### ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న జేసీ ఆదర్శరాజేందర్

**రామాపురం :** మండలంలోని గోపగుడిపల్లె గ్రామంలోని సర్వేనెంబరు 756/3లో ఫ్రీ హోల్డ్ భూములను జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేందర్ మంగళవారం పరిశీలించారు. అనంతరం సరస్వతిపల్లె సహకార బ్యాంకు తనిఖీ చేసి రైతులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 4,400 ఎకరాలు ఫ్రీ హోల్డ్ భూములను గతంలో గుర్తించారని, పరిశీలించి అక్రమాలు జరగకుండా చూడాలని వీఆర్‌ఓలకు ఆదేశించారు. ఆయనతో పాటు తహశీల్దార్ రామాంజనేయులు, ఆర్ఐ రవికుమార్, సొసైటీ సీఈఓ నాగేశ్వర్‌రెడ్డి, మండల సర్వేయర్ నాగలక్ష్మి, గ్రామ సర్వేయర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

### తహసీల్దారు కార్యాలయం తనిఖీ

**సంబేపల్లె :** స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ రంగస్వామి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డికేటి, ఫ్రీ హోల్డ్‌కు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. రికార్డులను పక్కాగా వుంచుకోవాలన్నారు. కార్యాలయానికి వచ్చిన ప్రజల సమస్యలు ఎప్పటప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి, సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### వరకట్న వేధింపులపై ఫిర్యాదు

**సుండుపల్లె :** వరకట్నం వేధింపులు తాళలేక ఓ వివాహిత మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండల పరిధిలోని మడితాడు గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ బాషా కుమార్తె షేక్ ఆల్విన్ సత్యసాయి జిల్లా కదిరికి చెందిన ఎస్.ఎస్. జాఫర్ సాదిక్‌ను 2021 ఆగస్టులో వివాహం చేసుకుంది. వివాహం జరిగినప్పటి నుంచి అత్తమామలు తాజ్ బాషా, జంషిదాలు వరకట్నం కోసం వేధిస్తున్నారని మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హుస్సేన్ తెలియజేశారు.